
# సెక్యులర్ వంతెన



**"ఇంకా ఏమిటోయ్** విశేషాలు, విశ్వనాథం... మన జనాభా ఏమంటున్నారు?" అనడిగేరు మంత్రిగారు తన నియోజకవర్గం నుంచి అనుచరుణ్ణి.

"అదేంటండి, పల్లేరు వంతెన ఓపెనింగు గురించి గట్టిగా ఆలోచించాలండి. బ్రిడ్జి పూర్తయి ఆర్నెల్లయినా ఇంకా ప్రారంభోత్సవం చెయ్యరేమని అందరూ అడుగుతున్నారండి. ప్రతిపక్షాలవాళ్లు ఇదే సందని మనకి ఎగస్పార్టీగా ప్రచారం చేస్తున్నారండి"

"మధ్యలో వాళ్లగోల ఏంటయ్యా? మేం ఇక్కడ గాడిదలు కాస్తున్నామా? నాకూ రావాలనే ఉంది కుదరద్దూ?"

"నిజమేనండీ. మీరన్నదీ రైటండి" అని ఊరుకున్నాడు విశ్వనాథం. అతనేమైనా ఇంకా అంటాడేమోనని మంత్రిగారు ఎదురుచూసేరు. అతనేమో మాట్లాడలేదు. కాస్త కోపం తగ్గించుకొని అనునయంగా మళ్లీ

ప్రస్తావించారు.

"అపోజిషన్ వాళ్లు ఏమంటున్నారయ్యా? అయినా నాకు తెలీకడుగుతాను. అసలు వంతెన కట్టి ఉండకపోతే ఏం చేసేవాళ్లయ్యా వీరంతా?

విశ్వనాథం ధైర్యం తెచ్చుకున్నాడు. కొంత బాధ, ఉక్రోషం మిళితమైన స్వరంతో, "అదేనండీ నా బాధ కూడా. అసలు ప్లాను వేయించింది మీరు! సీయమ్‌గారితో పోట్లాడి బుచ్చిరాజుగారి నియోజకవర్గానికి ఫండ్స్ వెళ్లిపోకుండా ఆపి వంతెన మనకు శాంక్షన్ చేయించింది మీరు. అనుకొన్నదానికన్నా ఆలీసం అయిపోయి మధ్యలో ఫండ్స్ ఆగిపోతే పట్టుబట్టి కొసదాకా తీసుకువచ్చింది మీరు. సిద్ధాన్నం తయారయ్యేక వాళ్లు తన్నుకుపోతున్నారండి. అదీ బాధ" అన్నాడు.

మంత్రిగారికి పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉన్నట్టు తోచింది. విశ్వనాథం ఎలాటివాడో తనకు బాగా తెలుసు. తన చెయ్యి దాటిపోతే తప్ప ప్రతీ విషయాన్ని తన దగ్గరికి తీసుకువచ్చి చికాకు పెట్టడు.

"ఏం మరీ అంత ఇదిగా ఉందంటావా?"

"ఏంచెప్పమంటారండి! వారానికి మూడు మీటింగులు పెట్టి ఒకటే లెక్చర్లండి. ఇదే అదను కదాని ప్రతిపక్షాల వాళ్లందరూ ఏకమైపోయి, "వంతెన తయారవ్వడానికే ఏడాది ఆలస్యమయింది. పూర్తయి ఆర్నెల్లయింది. తీరిక లేని ప్రజానాయకుల కోసం ప్రజలెంతకాలం వేచి ఉండాలి?" అంటూ గోలండి. ప్రజలు కూడా 'మంత్రిగారు మా మొహాలు చూడరా?' అని నా దగ్గరకు వచ్చి అడుగుతున్నారండి"

"ప్రజల సంగతి నా కొదిలేవయ్యా, విశ్వనాథం, నేను ఓసారి వచ్చి నలుగుర్నీ పలకరించేనంటే రెండు నిమిషాల్లో నావైపు తిప్పుకోగలను. కానీ అపోజిషన్ వాళ్లు ఈ లోపుల వాళ్ల బుర్రల్లో విషం ఎక్కించేస్తున్నారు. వెళదామంటే సిద్ధాంతి ఒప్పుకోవటంలేదు. ఉత్తర దిక్కుకి ప్రయాణం మరో ఆర్నెల్లదాకా కూడదంటే కూడదంటున్నాడు. ఆమధ్య లంకలో నాలుగూళ్లు తగలబడినప్పుడు వద్దామనే బయల్దేరాను. కానీ సిద్ధాంతి పడనిచ్చాడుకాదు. గ్రహస్థితి బొత్తిగా అధ్వాన్నంగా ఉందిట. అసలీ ఏడాది అటు వెళ్లద్దనే అంటున్నాడు" కాస్త ఆందోళనగానే అన్నారు మంత్రిగారు.

"ఎలా తెల్సిందోగానీ ఇది కూడా జనాలు అంటున్నారండి. వెంకటేశంగారు మొన్న పదిహేనున మీటింగులో 'మంత్రులకు కావాల్సింది మంత్రగాళ్లుకానీ మనలాంటి ప్రజలుకారు' అంటూ విసుర్లు విసిరేరండి. తమరే ఏదో ఒకమార్గం చూడాలి" వినయంగా చెబుతూనే నొక్కిచెప్పాడు విశ్వనాథం.

మంత్రిగారు నిస్సహాయంగా, "ఏంచెయ్యమంటావయ్యా? చావనా? ఈనగాచి నక్కలపాలు చేస్తున్నామని నాకూ బాధగానే ఉంది. గ్రహాలు ఎలా ఉన్నాసరే వెళదామంటే మంత్రి పదవికే ఎసరు వస్తుందేమో! నువ్వు చూస్తే రాక తప్పందంటావ్. సలహా అడుగుదామంటే సిద్ధాంతి దగ్గర్లేడు. వెంకట్రామయ్యగారు ఢిల్లీ వెంటబెట్టుకు వెళ్లేరు. నాలుగురోజుల్దాకా రాడు. ఏం చెయ్యాలిరా భగవంతుడా!" అంటూ వాపోయారు.

విశ్వనాథం అణుకువగానే, "ప్రతీదానికీ ఏదో ఒక విరుగుడు ఉంటుందండి. సిద్ధాంతిగారు లేకపోతేనేం, మా కొండదొర చేత రక్షరేకు కట్టించుకోండి. అంతేగానీ మీరింక వాయిదా వేయకండి" అంటూ అప్పటిదాకా దాచి ఉంచిన విషయం బయటపెట్టాడు.

"వచ్చేనెల ఒకటో తారీకున మీరు ఓపెనింగు చేయకపోతే ప్రతిపక్షాల వాళ్లంతా కలిసి జనాల్ని వెంటబెట్టుకుని వాళ్లే చేసేస్తామని అంటున్నారండి"

అతను భయపడ్డట్టుగానే మంత్రిగారు మండిపడ్డారు. 'అపోజిషన్ లీడర్ల జాతకాలు నాకు తెలీవా' అంటూ చిందులు తొక్కారు. కాస్సేపటికి శాంతించి, కాస్త ఆలోచించి ఆ కొండ దొరను తీసుకురమ్మన్నారు.

ఆ తర్వాత పనులు చకచకా జరిగిపోయేయి. కొండదొర వచ్చి 'ఏ రకమైన పీడా' ఉండేదని హామీ ఇచ్చి తాయెత్తు కట్టాడు. మంత్రిగారు వంతెన ఆవిష్కారం చేస్తారని అన్ని పేపర్లలోనూ వచ్చింది. శిలాఫలకం కూడా తయారయ్యింది. ఏర్పాట్లన్నీ పూర్తయ్యేయి.

ఢిల్లీలో అనుకొన్న దానికంటే ఎక్కువకాలం ఉండవలసి వచ్చినందున ఆలస్యంగా తిరిగి వచ్చిన సిద్ధాంతి ఇదంతా చూసి నెత్తి మొత్తుకొన్నాడు. పరుగుపరుగున మంత్రిగారి దగ్గరికి వెళ్లి అసలెలా ఒప్పుకొన్నారని ఖచ్చితంగా అడిగేడు.

"తప్పలేదయ్యా. కాన్ట్ బట్ పొజిషన్ వచ్చేసింది. కొండరాముడో, భీముడో ఒకతను వచ్చి తావీజు కట్టాడు. ఇప్పటిదాకా బాగానే ఉంది."

"వాడి శ్రాద్ధం! తాయెత్తులూ, గీయెత్తులూ ఏంచేయగలవండీ నా బొంద! మీరు దాని ఓపెనింగుకి వెళ్లద్దని స్పష్టంగా చెప్పానా? మీకు ఎస్ట్రాలజీ తెలియదు. చెబితే వినరు. శాంతి చేస్తే ఎఫెక్టు తగ్గేదయితే నేనే చేయించేవాణ్ణి. శాంతులూ, దానాలూనూ, అది అలాటి, ఇలాటి గ్రహంకాదు. ఓ ఊపు ఊపేస్తుంది. ముఖ్యమంత్రి పదవి అందాల్సింది పోయి మారకం కూడా కలగజేయగలదు"

మంత్రిగారికి ముచ్చెమటలు పోశాయి. క్షమాపణగా అన్నాడు. "నువ్వేమో లేకపోతివి. విశ్వనాథం వచ్చి పీకలమీద కూచున్నాడు, ఎలాగైనా ప్రారంభోత్సవం చేయాలని. ఏం చెయ్యను?"

సిద్ధాంతి పుంజుకున్నాడు. "విశ్వనాథానికేవండీ? ఎన్నైనా చెప్తాడు. అక్కడ వాళ్ల మధ్య తన ప్రెస్టేజి నిలబడాలని అతని తాపత్రయం. అసలా వంతెనకు శంకుస్థాపన టైములో పూజ, బలి అవీ జరగలేదు తెలుసా?"

"ఆఁ, బలి వెయ్యలేదూ?" అంటూ కొయ్యబారిపోయేరు మంత్రిగారు. "నిజమా? పూజలేకుండానా? అలా ఎలా జరిగిందయ్యా? ఎవడా ఇంజనీరు?" అని ప్రశ్నలు కురిపించేరు.

"హరనాథరావని ఓ కుర్ర ఇంజనీరు. ఈ సెక్యులర్ ఇండియాలో ఈ పూజలూ, బలులూ ఏవిటి నాన్సెన్సని అవేం లేకుండా మొదలెట్టేసేడు. మీరప్పుడు ఫారిన్ టూర్లో ఉన్నారు. నేను చెప్పాను. మంచిదికాదని. 'ఇది మన స్వంత ఇంట్లో పూజ అయితే వేరే విషయమండీ గవర్నమెంటు సొత్తుకదా. గవర్నమెంటు సెక్యులర్ గవర్నమెంటు' అంటూ అడ్డగోలుగా వాదించేడు.

మంత్రిగారికి మండింది. "సెక్యులరిజం అంటే ఏమిటయ్యా? నాస్తికత్వం అనా? అన్ని మతాలనీ గౌరవించు అని అర్థం. శంకుస్థాపన టైములో హిందువుల పూజచేయడం తప్పంటే సాయిబులదీ, కిరస్తానీ వాళ్లదీ కూడా చెరొ ఫోటో పెట్టమను. అంబేద్కర్‌వాళ్లు దగ్గరో ఉంటే ఓ బుద్ధుడి బొమ్మ కూడా తగిలిస్తే సరి. మమ్మల్ని చూసైనా నేర్చుకోవద్దయ్యా? నేను హిందూనే. అయితే మాత్రం మసీదుకానీ, గురుద్వారా కానీ మన నియోజకవర్గంలో కనబడితే వదిలిపెడతానా? వాళ్ల మంత్రాలు మనకు రావనుకో, అయినా నెత్తినో గుడ్డేసుకొని ఫోటో తీయించుకొంటాం. అప్పుడే వాళ్లనీ, 'మెయిన్ స్ట్రీమ్'లో తీసుకురాగలం. వీడేమైనా నాస్తికుడా?"

"అబ్బే, అదేం కాదండి. బొట్టు పెట్టుకునే వచ్చాడు. అక్కడికీ నేను చెప్పాను. నా చేత పూజ చేయించుకొని అదంతా ఖర్చులో చూపించినా, ఏ ఆడిటరూ అడ్డుపెట్టడని. విన్నాడుకాదు. వంతెన కూడా ఇచ్చిన ప్లాను ప్రకారమే కడతానని పట్టు. మా వియ్యంకుడు వాస్తు చూస్తాడుగా. 'వంతెనలో దోషం ఉంది అడ్డుగా గోడ కట్టించవయ్యా' అని కూడా తానంతటతానే సలహా చెప్పాడట. 'అబ్బే ట్రాఫిక్కుకి అడ్డొస్తుంది' అని మాట కొట్టిపారేసాడట వీడు. దాని దుష్ప్రభావం కూడా కొట్టేయడానికి లేదు?"

"ఎక్కడ దొరికాడయ్యా ఈ తిక్కలోడు? అసలే ఊరు వీడిది? ఇప్పుడెక్కడున్నాడు?"

"వాడి గొడవెందుకుగానీ, ముందు మీ సంగతి చూడండి. అసలే గ్రహాలు మహావీక్‌గా ఉన్నాయి. పైన పులిమీద పుట్రలా ఇదొకటి. ఈ రెండూ కలిస్తే క్షమించాలి... మారకం తథ్యం. తరవాత మీ ఇష్టం" అని మంచి పట్టులో నిష్క్రమించాడు సిద్ధాంతి.

మంత్రిగారికి పిచ్చెత్తినట్టయింది. అనివార్యకారణాల వలన కార్యక్రమం వాయిదా వేయమని టెలిగ్రాం ఇచ్చేరు విశ్వనాథానికి. దాంతో ప్రతిపక్షాల వాళ్లకి చచ్చిన ఉత్సాహం మళ్లీ పుంజుకొచ్చింది. కారణం తెలియకపోయినా మంత్రిగారి కార్యక్రమం ఆగినందుకు సంతోషించారు. ముందు అనుకొన్న

ప్రకారం ఒకటవ తారీకున ప్రజల్తో కలిసి వంతెన ఓపెన్ చెయ్యడానికి ఐక్యకార్యాచరణ సమితి ఒకటి ఏర్పడింది. నాయకులు ఎన్నుకోబడ్డారు.

కానీ ఇరవై ఎనిమిదో తారీక్కు విషయం ఊరంతా పొక్కింది. శంకుస్థాపన జరిగేటపుడు బలి జరగలేదనీ, వాస్తు దోషాలున్నాయనీ, అందుచేత ఎవరైతే ప్రారంభోత్సవం చేస్తారో వాళ్లు జలదేవతకు బలి అవక తప్పదనీ, రక్తం కక్కుకుని తక్షణం చావడం ఖాయమనీ సిద్ధాంతి బల్లగుద్ది చెప్పాడని కూడా పుకారు లేచింది.

ప్రతిపక్షాల తరఫున వంతెన ప్రారంభోత్సవం చేయడానికి ఎన్నుకోబడిన నాయుడికి దిగులు పట్టుకుంది. సిద్ధాంతి మాట కొట్టేయడానికి లేదు. అతను చెప్పినది ఎన్నడూ తప్పలేదు. అతను గీచినగీటు దాటకుండా ఉండటం వలనే మంత్రిగారు పంచాయితీ లెవల్నించి ఇంతవాడయ్యేడు అనుకొన్నాడు నాయుడు.

ఆ సాయంత్రం నాయుడు ఐక్య కార్యాచరణ సమితి మీటింగు ఏర్పాటు చేసి ఈ ప్రారంభోత్సవం తనవంటి వృద్ధుడు చేయడంకంటే యువనాయకులు ఎవరైనా చేస్తే సమంజసంగా ఉంటుందని భావిస్తున్నానీ, ఎవరైనా ముందుకు రావాలనీ కోరాడు.

కానీ అప్పటికే ఆ పుకారు అందరూ వినడం వలన ఎవ్వరూ ముందుకు రాలేదు. ఎవరికి వారు 'మీరు చేస్తే బాగుంటుందంటే మీరు చేస్తే బాగుంటుందనడం' మొదలెట్టారు.

చివరికి అందరూ కలిసి ఇది కార్మికుల కృషి ఫలితం కాబట్టి శ్రామికవర్గ నాయకుడు వెంకటేశం ఉంటేనే బాగుంటుందన్చెప్పి అతన్ని ముందుకు తోసారు. ఇలాటి మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఇంతకుముందు ఉద్యమం నడిపినవాడు కాబట్టి కిమ్మనలేకపోయాడు వెంకటేశం.

కానీ ఆ రాత్రి మాత్రం వాళ్లావిడ ఎందుకు ఒప్పుకొన్నారని పెద్ద పోట్లాట వేసుకొంది. తన అభ్యుదయవాదానికీ, భార్య ఛాందసానికీ ఎప్పుడూ చుక్కెదురే. కాబట్టి వెంకటేశం ఏం వాదించకుండా 'తప్పలేదు, ఏంచేస్తాం' అని నోరు చప్పరించి ఊరుకున్నాడు.

'ఆమాటకొస్తే వంతెనమీద అనేకమంది ఇప్పటికే నడుస్తున్నారు' అన్నాడు. 'అదంతా లెక్కలోకిరాదు. ఇల్లు కట్టేటప్పుడూ, గృహప్రవేశం ముందు రోజూ కూడా చాలామంది ఇంట్లో తిరుగుతారు. కానీ ముహూర్తం అంటే ముహూర్తమే. అప్పుడు అడుగుపెట్టడమే ముఖ్యం' అని ఎదురు వాదించిందామె.

పిల్లలందరితో సహా నూతిలో దిగుతాననీ, వితంతువుగా మరణించేకన్నా అలాటి చావే మేలని ఏడ్చి, అరిచి, గోలచేసి సాధించింది.

మరుసటిరోజు ఇసకవేస్తే రాలనంత జనం వంతెన దగ్గర పోగడ్డారు. ఏదో వింత జరుగుతుంది చూద్దామని పక్క ఊళ్లో జనం కూడా వచ్చారు.

కానీ వెంకటేశం మాత్రం రాలేదు. ముహూర్తానికి కొద్దిగా ముందుగా ఒకడు పరిగెట్టుకువచ్చి చెప్పాడు. వాళ్ల బామ్మర్దికి ప్రాణాలమీద కొస్తే అర్జంటుగా కుటుంబంతో వాళ్లూరు వెళ్లారని.

దాంతో నాయకులందరి కాళ్లూ చల్లబడ్డాయి. ఇంకా అక్కడే ఉంటే మళ్లీ మీరంటే మీరన్న జాతర ప్రారంభమవుతుందన్న భయంతో నెమ్మదిగా జనాల్లో కలిసిపోయేరు.

అప్పటిదాకా 'జిందాబాద్' కేకలతో దద్దరిల్లిన ఆ ప్రదేశం నెమ్మదిగా నిశ్శబ్దమయి పోయింది. ముహూర్తసమయం ఆసన్నమయింది.

ఇంతలో గుంపులోంచి ఓ కుక్క వంతెన వైపు నడవసాగింది. జనం అంతా ఉగ్గబట్టుకు చూస్తున్నారు. కుక్క గతి ఏమవుతుందాని. కుక్క నింపాదిగా వంతెన ఎక్కింది.

జనం మొహంలో ఆతృత, ఆందోళన, గాలి స్తంభించింది. కుక్క వంతెన మీద హాయిగా నడిచిపోసాగింది.

"ఈ స్ట్రీట్‌డాగ్‌కే భయంలేనప్పుడు మనలాటి అండర్ డాగ్స్‌కి భయం ఏమిట్రా, పదండి' అని అరిచాడొక యువ విద్యార్థి. అతనివెంట పదిమంది వంతెన మీదకు పరుగెట్టేరు. అంతే! వెల్లువలా

ప్రజలు. ఉరికేరు, పరుగులు పెట్టేరు, డ్యాన్సులు వేశారు. ఒకళ్లనొకళ్లు తోసుకొన్నారు. వందలాదిగా, వేలాదిగా, మందలు, మందలుగా ప్రజలు ముందుకు పోసాగేరు.

అందరికంటే ముందు నడిచిన కుక్క వెనక్కి వచ్చేసింది. అడావుడి నచ్చలేదులా వుంది. ప్రారంభోత్సవం గురించి రాసిన శిలాఫలకం దగ్గరకు వచ్చింది. చుట్టూ తిరిగింది, వాసన చూసింది. చివరికి మూఢ నమ్మకాలకీ, ప్రజాపరిపాలనకూ ముడిపెట్టే రాజకీయాలపై నిరసనగా కాలెత్తింది.

●

(విపుల ఆగస్టు 1997లో ప్రచురితం)